

# కాపిటల్

— డాక్టర్ శాంతికుమార్

చిత్తూరులో ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరింది విజయవాడ వెళ్లే సెమీ లగ్జరీ బస్సు. బస్సులో మూడో వంతు మాత్రమే ప్రయాణీకులున్నారు. ప్రవేశ ద్వారం ఎదురుగా వున్న త్రీ సీటర్‌లో నేనొక్కదాన్నే కూర్చుని రంగనాయకమ్మ గారి 'కాపిటల్' తెలుగు అనువాదం తిరగేస్తున్నాను.

స్పీడును కంట్రోల్ చేసిన రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ వారి ఎక్స్‌ప్రెస్ 'నిదానమే ప్రధానం' అన్న సూక్తిని గతుకుల రోడ్డు సాక్షిగా అక్షరాలా పాటిస్తూ ముందుకు సాగుతోంది. కాళహస్తి దాటాక ... రైల్వే గేటు దగ్గర మూడు గంటల సేపు 'ట్రాఫిక్ జాం' అనంతరం ... నెల్లూరు చేరాల్సిన టైముకి నాయుడుపేట చేరిందా బస్సు!

నాయుడుపేట బస్టాండ్‌లో నాలుగువైపులా ఎర్రని రంగు కాగితాల తోరణాలు గాలికి రెపరెపలాడుతున్నాయి. వాటి మధ్య ఎర్ర జెండాలు గర్వంగా ఎగురుతున్నాయి.

ఏమిటీ రోజు విశేషం?

నేనంతగా పట్టించుకోలేదు గానీ ... చిత్తూరులోనూ కాళహస్తిలో కూడా ఎర్ర కాగితాల తోరణాలు చూసినట్లు లీలగా మనసులో మెదిలింది.

అవును కదూ! ఈ రోజు మే - ఒకటో తేదీ!

"అంతర్జాతీయ శ్రామిక దినోత్సవం మేడే!" అనుకున్నాను.

చేతిలో వున్న కాపిటల్ ప్రభావమేమో ... కొంచెం ఆసక్తిగా పరిశీలించాను.

ఆ వాతావరణంలో ఏదో భిన్నత్వం గోచరించింది!

ఏమిటా భిన్నత్వం?!

ఓ క్షణం ఆలోచిస్తే గానీ అర్థం కాలేదు.

అన్నీ ఎర్ర జెండాలే! అయితే వేర్వేరు యూనియన్ల పేరుతో ఎగురుతూ వున్నాయి!

శ్రామికులంతా ఒకటి కాదా?

కనీసం ... ఒక సంస్థలో ... ఒకే యాజమాన్యం కింద పనిచేస్తున్న కార్మికులందరూ అయినా ఒకటి కాదా?

"ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!' అన్న అంతర్జాతీయ నినాదం కోరుతున్న ఏకత్వంలో ఈ భిన్నత్వమేమిటి? ఇంత వైరుధ్యమేమిటి? సమైక్యత సాధించాలంటే ... అనైక్యత పెంచటమే మార్గమని నాయకుల అభిప్రాయం కాబోలు! ఇక ప్రపంచ కార్మికులంతా ఏకమయ్యేదెప్పుడు? ఇది నేను మాత్రం ఆలోచించవలసిన విషయం కాదనుకోండి.

అసలు ఒకప్పుడైతే ... "కార్మికులంతా ఏకం కావటమేమిటి? ఎవరి పని వాళ్లు చేస్తారు! ఎవరి జీతాలువాళ్లు తీసుకుంటారు!" అనుకునేదాన్ని.

అంతేకాదు ... పెట్టుబడి, శ్రమ, ఉత్పత్తి విలువ, శ్రమ విలువ, అదనపు విలువ, శ్రమ దోపిడీ... లాంటి పదాలు కరపత్రాల్లో చూసినా, ఎక్కడన్నా ఉపన్యాసాల్లో విన్నా ... ఆ పదాల మధ్య సంబంధం ఓ 'జిగ్సాపజిల్' లాగా అనిపించి ఎప్పుడూ నన్ను గందరగోళంలోకి త్రోసేవి!

ఈ మధ్య కాపిటల్ తెలుగులో చదవడం ప్రారంభించాకే క్రమక్రమంగా అర్థమవసాగింది! ప్రతి సంఘటనలోనూ, సందర్భంలోనూ ఆ పదాలు ఎలా అన్వయింపబడతాయో విశ్లేషించి చూడటమూ అలవాటైంది! ఈ క్రమంలో నేను మొదటగా అర్థం చేసుకుంది - "గృహిణుల శ్రమే కనీస విలువకి కూడా నోచుకోకుండా దోచుకోబడుతోం"దని!

'సత్యమేవ జయతే' లాగానే 'శ్రమయేవ జయతే' అని కూడా పెద్దలెవరో అన్నారట! వర్తమానంలో మొదటిదెంత దుస్సాధ్యమైన విషయమో బహుశా అందరికీ అనేక పర్యాయాలు తెలిసే వుంటుంది.

ఇక 'శ్రమయేవ జయతే' విషయం ... అదే నిజమైతే కార్మికులందరికీ సుఖాలున్నాయా?

అసలు శ్రమతో సంబంధంలేని ఉత్పత్తి ఏదైనా వుంటుందా? ప్రతి ఉత్పత్తిలోనూ ఏదో ఒక దశ వరకైనా 'శ్రమ' ప్రమేయం వుండి తీరాలి!

నిన్న 'కాపిటల్' మూడో భాగం ప్రారంభించినప్పుడు కూడా అలాగే అనుకున్నాను. ఈ ప్రయాణంలో బస్సులో ఆ సంఘటన జరిగి వుండకపోతే ఎప్పటికీ అలాగే అనుకునేదాన్నేమో! ఆ సంఘటనే...

ఈ ఆలోచనకు ప్రేరణ! ఈ కథకు ప్రాణం!

నాయుడుపేటలో బస్సు బయలుదేరడంతో కుదుపుకి ఆలోచనా స్రవంతి నుండి ప్రయాణ ప్రపంచంలోకి వచ్చాను. జరిగిన ఆలస్యమూ, బస్సు 'వేగమూ' వల్ల ప్రయాణీకుల ముఖాల్లో చిరాకు

తాండవిస్తోంది. బస్సు నిండుగా వుండటంతో కండక్టర్ ముఖంలో మాత్రం ఆనందం పరుచుకుంది. ఒకప్పుడు 'స్టేజి'ల్లో కూడా ఆగకుండా పరిగెత్తే ఆర్టీసీ బస్సులు ... ఇప్పుడు స్టేజి కాకపోయినా ఆగి మరీ ప్రయాణీకుల సేవ చేసేస్తున్నాయి. 'కలెక్షన్ బోనస్' విధానమే అందుక్కారణం. అతని ఆనందం చూసి, "శ్రమా! వర్ధిల్లు!" మనసులోనే అనుకున్నాను.

మరో గంటున్నర తరువాత బస్సు గూడూరు చేరింది.

ఒకరిద్దరు దిగారేమో ... అరడజను మంది ఎక్కారు.

అక్కడ లంచ్ బ్రేక్. డ్రైవరూ, కండక్టరూ క్యాంటీన్‌కు భోజనానికి వెళ్లారు. వేసవి రవి తన ప్రతాపమంతా ప్రదర్శిస్తున్నాడు. ఉక్కపోత ప్రయాణీకుల అసహనాన్ని రెట్టింపు చేస్తోంది.

అప్పుడు ... ఒక స్త్రీ బస్సులోకి ప్రవేశించింది. పాతికేళ్ల వయస్సుంటుందేమో కానీ, దశాబ్దాల దారిద్ర్యం ఆమె ముఖంలో సజీవంగా కనిపిస్తోంది. ఆమె చేతుల్లో పీలికల్లాంటి పాత్తిళ్లలో ... చుట్టినట్లున్న పసిబిడ్డ!

పుట్టాక ... "అమ్మ కంటే ముందు తెలిసేది ఆకలే" నన్న సత్యానికి సంకేతంగా ఏడుస్తోందా బిడ్డ! ఆ స్వరం అటకమీద పిల్లి కూన అరుపులా ... నూతిలోంచీ వినిపిస్తున్నట్టుంది. ద్గాన్ని బట్టే ఆ బిడ్డ వయసు రెండు వారాలలోపే వుండవచ్చుననిపించింది.

బిడ్డ ఏడుపుని పట్టించుకోకుండా "బాబూ! తల్లీ! ధర్మం వెయ్యండి. ఏ దిక్కూ లేని దాన్ని. దేవుళ్లైనా నా బిడ్డ ఆకలి తీర్చండి. నా బిడ్డకు ప్రాణం పొయ్యండి!

బాబూ! తల్లీ!" దీనంగా అరుస్తోందామె.

సీట్ల మొదటి వరుస దగ్గర నిలుచుని వుందామె. ఆమె ఒంటిపైని చీరలో ఈ దేశ సమగ్రతంత గందరగోళం కనిపిస్తోంది! ఆచరణలో సెక్యులరిజంలా చివికిపోయి, చిరుగులు పట్టిన ఆ చీర చూస్తుంటే నాకు చెరబండరాజు 'వందేమాతరం' కవిత స్మృతిపథంలో ప్రతిధ్వనించింది.

ఆమెను చూస్తుంటే నా కళ్లలో వేదనా మేఘం క్రమ్మింది.

"బాబూ ధర్మం! తల్లీ ధర్మం!" ఆమె కదిలింది.

"బిడ్డల్ని అడ్డం పెట్టుకుని డబ్బులు దండుకోవటం మొదలెట్టారు బిచ్చగాళ్లు. వచ్చిన డబ్బులో అర్ధరూపాయన్నా బిడ్డకోసం ఖర్చు పెడుతుందో? లేదో!" బుగ్గలు నొక్కుకుంటూ అంది నా ప్రక్కన కూర్చున్న ఓ 'పిన్ని' గారు. "బిచ్చగాళ్లే అనేముంది లెండి! బోల్డంత ఆస్తున్న వాళ్లు కూడా బిడ్డల్ని అడ్డం పెట్టుకుని కట్నాం పేరుతో డబ్బులు దండుకోవడం లేదా? దానికీ దీనికీ పెద్ద తేడా ఏముంది లెండి!" ఆ పసిబిడ్డ ఏడుపుకి స్పందించి వ్యంగ్యంగా అన్నాను. "అసలది దాని బిడ్డో, లేక ఏ ఆసుపత్రిలోనన్నా దొంగిలించుకొచ్చిందో?" ముక్కున వేలేసుకుందో ఐరావతమ్మ ఆశ్చర్యార్థక ముఖం పెట్టి.

"అవునండీ! పసిబిడ్డల్ని దొంగిలించి కాళ్లూ చేతులూ విరిచి వికలాంగులుగా మార్చి భిక్షాటనకుపయోగించుకుంటారట. కొందరైతే మరీ కిరాతకంగా కళ్లు పీకేసి గుడ్డివాళ్లని చేసేస్తారట! చూపు లేదంటే మనం సహజంగానే మరింత జాలిపడతాం కదా, అలా సొమ్ము చేసుకుంటారన్న మాట! ఎంత ఘోరం!" మరో నడివయస్సు మహిళ వార్తాతరంగిణి ప్రారంభించింది.

"అంతేనా! శరీరంలోని అవయవాల్ని వేలకి వేలు తీసుకుని అమ్మేస్తారట! కొన్ని అవయవాలకి బోల్డు ధర పలుకుతుందని ఆ మధ్య పేపర్లో చూశాను. కాలం ... కలికాలం దాపురించింది. అంతదాకా

> **సమాజంలో దోపిడీ ప్రధానంగా వున్నంత కాలమూ రూపాలూ, సందర్భాలూ మారినా, సారాంశం ఒకటిగానే వుంటుంది. అంటే, దోపిడీతో పాటు దానికి అనుగుణమైన భావజాలమూ కొనసాగుతూ వుంటుంది. పెట్టుబడి సాయంతో దోపిడీ చేయలేని వాళ్ళు యీ భావజాలం సాయంతో చేయగలుగుతారు, ఇందుకూ, అందుకూ సామాజిక సంబంధాలలూ వుండడమే కారణం.**

ఎందుకండీ! కప్పల్ని మాత్రం బ్రతకనిస్తున్నాడటండి మనిషి? చైనా, జపాన్ దేశాలకు ఎగుమతి చేస్తారట. వాళ్లు ఎంచక్కా ఊరగాయలు పెట్టుకుంటారు. రెణ్ణెల్లనాడు ఒంగోలు దగ్గర ఓ పల్లెటూళ్లో ఇరవై వేల కప్పల్ని దొంగ రవాణా చేస్తున్న వాళ్లని పట్టుకున్నారు కాదూ". మరొకామె తన సేకరించిన సమాచారాన్ని జ్ఞాపకాల పొరల్లోంచీ తవ్వి బస్సులో కుమ్మరించేసింది.

"జీవకారుణ్యం, మానవత్వం మరిచి లాభార్జనే లక్ష్యంగా వ్యాపారం చేసుకుందుకు అలవాటుపడ్డ వాళ్లకి కప్పకీ, అప్పకీ తేడా ఏముంటుంది? దేన్నైనా, ఎవర్నయినా అమ్మెయ్యగలడు. ఇలాంటివాళ్లు ఖచ్చితంగా నరకానికే పోతారు" అంది మరోవనితా శిరోమణి.

ప్రతి బాధకీ ఓ కారణముంటుంది! అదేమిటో ఆలోచించే ప్రయత్నం చెయ్యకపోగా ... ఎదుటివారి నిస్సహాయతని 'కాలక్షేప వస్తువు'గా మార్చుకోవడం మానవతకే అవమానకరం!

"ధర్మం! ధర్మం!" అరుస్తూ ముందుకు నడుస్తున్న ఆమె వైపు దృష్టి మరల్చాను.

పచ్చి బాలింతరాలు! పురిటి వాసన కూడా ఇంకా పూర్తిగా వీడలేదు. కనీసం ఆ కొంత తోడుంటే విశ్రాంతిగా ఉండాల్సిన స్త్రీ... ఇలా రక్తాన్ని ఆవిరి చేసే గ్రీష్మపు ఎండల్లో ఒసుక్కుంటూ తిరగాల్సిన అవసరమే ఉండేది కాదేమో!

ఆమె నా సీటు దగ్గరకొచ్చే సరికే వానిటీ అంతా వెతికి తీసిపెట్టుకున్న రూపాయి బిళ్ళ ఆమె చేతిలో వేస్తూ, "ముందా పమిట సరిగ్గా వేసుకో!" మందలింపుగా అన్నానే కానీ ఆమె ఎంత నేర్పుగా సర్దుకున్నా ఆ చీర కంతటి శక్తి లేదని అర్థమవుతూనే వుంది.

ఆమె ఒక్కసారి నన్ను ఎగాదిగా చూసింది. ఆ చూపులు నా ఒంటిని నిండుగా కప్పి వున్న అమెరికన్ జార్జెట్ చీరెని చిల్లులు పొడిచేస్తున్నట్లున్నాయి. ఆమె పెదవులపై మెరిసిన వ్యంగ్యం ఈ ప్రపంచాన్నే వెక్కిరిస్తున్నట్లుంది. క్షణం క్రితం నేనిచ్చిన రూపాయి ఆమె మనోగత భావాల్ని అంతకు మించి వ్యక్తం కానివ్వకుండా పరిమితం చేసి వుండవచ్చు. ఆమె... 'కాలం విలువ' బాగా తెలిసిన దానిలా ముందుకు కదిలింది. చివరి సీటు వరకూ వెళ్ళింది.

ఆమె చేతిలో గల గలలు సృష్టించేందుకు రూపాయికి తోడు మరో నాణెమేదీ పడలేదు. ఆ ముఖంలో పరుచుకుంటున్ననిరాశనీ, నిస్పృహనీ బిడ్డ ఏడుపు తుడిచేసింది.

ఒకసారి బయటికి చూసిందామె.

డ్రైవర్ బస్సుముందు నిలబడి సిగరెట్ కాలుస్తూ కండక్టర్‌తో మాట్లాడుతున్నాడు.

పట్టుదలగా మళ్ళీ మొదటి సీటు దగ్గరకు నడిచింది.

నా చూపు లామెను వెంటాడుతూనే వున్నాయి.

బిడ్డ ఏడుపులో ధ్వనిస్తున్న 'ఆకలి రాగం' మనసుని ద్రవింప జేస్తోంది. బిడ్డనలాగే ఎడమ చేత్తో పొదివి పట్టుకుని, రవిక ముడి విప్పిందామె. రొమ్ము బిడ్డ నోటికందించింది. బిడ్డ తల అడ్డంగా వున్న భాగం తప్ప, ఆమె ఛాతీ దాదాపు నగ్నంగా కనిపిస్తోంది. బస్సులోని చాలా మంది కళ్ళు క్రమంగా ఆమె మీదే కేంద్రీకృతమయ్యాయి.

ఆమె తెగువకి ఆశ్చర్యమూ, ఆ తెంపరి తనానికి అసహ్యమూ కలిగాయి నాకు. "స్త్రీ జాతికి తల వంపులు తెచ్చేదిలాంటి వాళ్ళే!" అనిపించి కోపంతో నా శ్వాస వేగం హెచ్చింది

మళ్ళీ 'ధర్మం' అరుపులతో నెమ్మదిగా నడుస్తోంది. ఆమె చేతిలో గలగల నాణేల చప్పుడు వినిపించ సాగిందిప్పుడు! కొందరు మగవాళ్ళ నేత్రానందపు బలహీనతని ఎంత తెలివిగా సొమ్ము చేసుకుంటోంది!

రొమ్ము నుంచి పాలొస్తున్నాయో లేదో గానీ బిడ్డ చప్పరిస్తూనే వుంది.

"బిచ్చగాళ్ళు మరీ బరి తెగించిపోతున్నారు! అడుక్కుంటే మాత్రం... ఆడది కాదూ? కాస్తంతైనా సిగ్గూ, లజ్జా ఉండనక్కర్లే?" ఓ కళ్ళ జోడు పెద్దాయన అద్దాల్ని పై కండువాతో తుడిచి పెట్టుకుని చూస్తూ అన్నాడు.

"మాన భంగాలు జరుగుతున్నాయంటే ఇలాంటి ప్రొవొకేటివ్ దృశ్యాలే కారణం!" మరో ప్యూరిస్ట్ స్టేట్ మెంట్. అర్ధనగ్న సినిమాలు, అక్షర నీలి

చిత్రాల్లాంటి నవలలూ, సీరియల్సూ, వాత్స్యాయనుణ్ణి కూడా ఆశ్చర్యంలో ముంచెయ్యగల భంగిమల సినిమా డ్యాన్సులూ, వీధుల్ని నగ్నత్వంతో అలంకరిస్తున్న సినిమా పోస్టర్లూ, వినిపిస్తున్న ద్వంద్వార్థాల సినిమా పాటలూ... ఇవేవీ రైప్డుగొట్టే బూతు కాదేమో మరి, ఆమహానుభావుడి దృష్టిలో!

''లక్షణంగా నవనవలాడుతున్నావు, నాలుగిళ్ళలో పని చేసుకు బ్రతక రాదూ?!'' అయిదు పైసల బిళ్ళ ఆమె చేతిలో వేస్తూ గుటకలు మింగుతూ అన్నాడు. శ్రమ పట్ల విపరీతమైన గౌరవమున్న ఓ మేధావి (అతన్ని చూస్తే అలా అన్పించింది).

నవనవలాడుతూండే వాళ్ళంతా శ్రమకు దూరంగా వుండటం వల్లే అలా ఉండగలుగుతున్నారని అతనికి తెలియదేమో!

''పెద్ద పర్సనాలిటీ గురూ! శుభ్రంగా తల స్నానం చేసి మంచి చీరె కట్టుకుని, అలంకరించు కుంటే 'బ్యూటీ'ల మనుకునే ఎవరికీ తీసిపోదది!'' అంటున్నాడో జీన్స్ యువకుడు ప్రక్కనున్న మిత్రుడితో!

''ఇప్పుడు మాత్రం అందంగా లేదూ? బాగా చూడు! ఈ యాంగిల్‌లో అచ్చం రామ్ తేరీ గంగామైలీలో బిడ్డకు పాలిస్తున్న మందాకినిలా లేదూ?'' అన్నాడో 'కళా'హృదయుడు అభినవ రాజ్ కపూర్‌లా!

నాకు వినిపిస్తున్న ఈ మాటలన్నీ ఆమెకీ తప్పకుండా వినిపిస్తూనే వుండాలి.

ఆమె చర్యని నేనెంతగా నిరసిస్తున్నప్పటికీ ఒక స్త్రీ... నిస్సహాయ... అలా వ్యాఖ్యానించబడటాన్ని స్త్రీగా నేనేమాత్రం భరించలేకపోతున్నాను.

ఆమె ఇవేమీ లెక్క చెయ్యటం లేదు.

తిరిగి వస్తూ, నా సీటు దగ్గర ఆగింది.

నా చూపుల్లో నిరసన వ్యక్తమవుతూనే వుంది.

''చూశావా తల్లీ! నేను సిగ్గులేని దాన్ని కాదు సిగ్గు దాచుకుందుకు బట్టలు కరువైన దాన్ని. అమ్మా! నా దీన స్థితి, ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టి రెండు వారాలైనా నిండని పసిదిడ్డ ఆక్రందనా చూస్తూ, ఎంటున్నా కరగని హృదయాలు... ముడి విడిపడి రవికె చాటు తొలగిన నా గుండెను చూడగానే ఎండలో పడిన ఐయిసుముక్కలా ఎలా కరిగి పోయాయో!'' అంది.

ఆమె మాటలకి షాక్ తిన్నాను. కాస్తో కూస్తో చదువుకున్న దానిలా వుంది!

''బండరాళ్ళు కాదు, తోడేళ్ళు పుష్కలంగా ఉన్న సమాజంలో నీ పద్ధతి చాలా ప్రమాదకరం. నిన్ను నువ్వు రక్షించుకోలేని ఆపద ఎదురైతే?'' నా మాటల్లో వ్యక్తమైన ఆందోళనకు పకపక నవ్వింది.

''ఏమిటమ్మా అంత ప్రమాదం? శీలాన్ని రక్షించుకోవటమేనా! నన్ని బిడ్డకు తల్లిని చేసిన ఓ పిరికి వాడి ప్రేమకు నా శీలం ఎప్పుడో బలైంది. శీలానికి అర్థం స్వచ్ఛంగా ఉండటమే అయితే... ఈ సమాజం శీలం కోల్పోయి చాలా కాలమైంది. ఇకఈ పద్ధతంటావా? లక్షల డబ్బు కుమ్మరించి... నిర్మాతలు, దర్శకులు... హీరోయిన్ల అందాల్ని తెర మీద పరుస్తున్నది. ఈ 'డబ్బు' కోసం కాదూ? హీరోయిన్లు అంగాంగ ప్రదర్శన చేస్తూన్నది మాత్రం ఈ డబ్బు కోసం కాదూ! నేనూ అంతే! చూశావుగా! మనుష్యుల్లోని మానవత్వం... దాతృత్వంగా రూపాంతరం చెంది చిల్లర రూపంలో బయటపడాలంటే నేను పెట్టగల పెట్టుబడి ఇదొక్కటే నమ్మా! చూడు రెండు నిమిషాల్లో పిడికెడు చిల్లర!''

మానవత్వం గురించి ఆమె విశ్లేషణ, ప్రస్తుత వ్యాపార సమాజం గురించి ఆమె కున్న అవగాహన నన్ను ఆశ్చర్యంలో ముంచేశాయి. ఆమె వాదన కేవలం తన చర్యని సమర్థించుకోవటంగా మాత్రమే భావించలేకపోయాను. నా కోపం ఆమె పట్ల హృదయపూర్వక సానుభూతిగా మారింది. ఆమెకు మరో అయిదు రూపాయిలిచ్చాక గానీ నా మనసు ప్రశాంతంగా ఉండలేకపోయింది, దాంతో ఆమె పరిస్థితిలో వచ్చే మార్పేమీ లేకపోయినప్పటికీ!

''వెళ్తానమ్మా! మరో బస్సొచ్చింది!'' రవిక ముడి వేసుకుని గబగబా వెళ్ళిపోయింది. శకుంతలకి ఇరవయ్యో శతాబ్ది శకలంలా. పొత్తిళ్ళలో ఉన్న భరతుడో, భారతో నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

సిగరెట్ విసిరేసి డ్రైవర్ బస్సెక్కాడు.

కళ్ళెదుట ఎన్ని ఘోరాలు జరుగుతున్నా పట్టించుకోని ఈ వ్యవస్థలా బస్సు మెల్లగా పోతోంది.

నేను మాత్రం ఆలోచిస్తూనే ఉన్నాను!

•భౌతిక సౌందర్యం• పెట్టుబడి! కొందరికైనా క్షణిక నేత్రానందం!

ఆమెకు పిడికెడు ఆర్థిక ప్రయోజనం!

పెట్టుబడి... ఉత్పత్తి... దోపిడీ'' అంటూ ఆ ప్రకారం విశ్లేషించే ప్రయత్నం చేశాను.

శ్రమ ప్రమేయం లేని ఈ సంఘటనలో... ఎవరు ఎవర్ని దోపిడీ చేశారు?

కాపిటల్ పూర్తిగా చదివితే నా ప్రశ్నకు జవాబు దొరుకుతుందేమో!

స్త్రీని ఏదో ఒక రూపంలో, ఏదో ఒక స్థాయిలో ఎక్స్‌ప్లాయిట్ చెయ్యని 'ఇజ'మంటూ వుంటే అదే ఇలాంటి ప్రశ్నలుత్పన్నమయ్యే పరిస్థితుల్ని తొలగించ గలదు!

( ఈ వాస్తవ సంఘటన చెప్పి, కథ వ్రాయమని ప్రోత్సహించిన సోదరి అరుణకు)

శ్రమ ప్రమేయం లేని ఈ సంఘటనలో ఎవరు ఎవర్ని దోపిడీ చేశారు? 'కాపిటల్' పూర్తిగా చదివితే నా ప్రశ్నకు జవాబు దొరుకుతుందేమో!

స్త్రీని ఏదో ఒక రూపంలో, ఏదో ఒక స్థాయిలో ఎక్స్‌ప్లాయిట్ చెయ్యని 'ఇజ' మంటూ వుంటే, అదే ఇలాంటి ప్రశ్నలుత్పన్నమయ్యే పరిస్థితుల్ని తొలగించ గలదు.




